**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

# ఎవ్వారేమని విందురు...

-అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి

నిర్మలమైన నీలాకాశాన్ని చూస్తుంటే నా కళ్లకు కట్టినట్లు ఒకే ఒక్క ఆకృతి కనిపిస్తోంది ఇప్పుడు. 'ఎప్పడెప్పుడు వెళ్లి ఆ సన్నిధిని చేరతానా?' అని ఒకటే ఆరాటంగా ఉంది మనసుకి. నన్ను గుర్తు పడతారా ఆవిడ? ఎంత నిండు మనిషి. నోరారా నవ్వుతూ పలకరిస్తుంటే చల్లని ప్రభాత పవనం వీచినట్లుండేది. పాట పాడుతుంటే గంధర్వగానంలా తోచేది. సహనం, శాంతి, సౌందర్యం మూర్తీభవించిన దేవత కదూ ఆమె.

"ఇదో టీచరమ్మా... మావోడు బడికెళ్లనని మారాం సేత్తన్నాడు. ఏం సెప్తావో ఏవో..ఈడి మనసు మార్సి మాబాగా సదువచ్చేట్టు సెయ్యి... నీ కాల్మొక్కుతా... సేద్దాన్ని నమ్మకుని ఈడయ్యలాగే ఈడూ సత్తే నాకు దిక్కెటమ్మా... నీ సేతిలెడతన్నా... కొత్త పున్నెం కట్టుకోతల్లా" అంటూ అమ్మ నన్నా రోజుల్లో ప్రతిమా టీచర్‌కి అప్పజెప్పకపోతే నేనెలా తయారై ఉండేవాణ్ణో!

"ఐదో తరగతి చదివే అబ్బాయివి... ఇలాగేనా ఉండేద...రా... ఇలారా. చొక్కాకి గుండీలెందుకు పెట్టుకోలేదు. క్రాఫెందుకు దువ్వుకోలేదు. అరె చిన్నా దువ్వెన తీసుకురారా... ఆ... ఇలా బుద్ధిగా బాసింపట్టు వేసుకు కూర్చో. నీ పేరు...ఆ సాయి కదూ.... సాయి మంచి పిల్లవాడు. ఇక నుంచీ బాగా చదువుకుంటాడు. అల్లరి చేయడు. కదరా చిన్నా" ప్రతిమా టీచర్ పలుకుల్లో ఏం శక్తి వుందో కానీ నేను మంత్రించినట్లు అలాగే కూర్చుండిపోయాను ఆమె వంక చూస్తూ, ఆ మాటలు వింటూ.

"చిన్నా... ఇప్పుడు మనం ఒక కథ చెప్పుకుందాం. కథ తరువాత ఓ పాట, పాట తరువాత పాఠం..." అంటూ మర్యాదరామన్న తీర్పు కథ చెప్పి 'మల్లెకన్నా జాబిలికన్నా..చల్లని పాపాయి లాలీజో' అని తీయగా పాడి ఏదన్నా పాఠం బోధించేవారు. ఆమె చెప్పినట్లు విని ఎప్పటి హోంవర్క్ ఆ రోజు చేసేస్తూ బాగా చదివే విద్యార్థుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్నాను.

"టీచరమ్మకియ్యారా... మాగొప్ప తల్లి...ఆయమ్మ సలవే నీకింత ఇద్దె రావడం...నేసెప్పిన మాటిని నువ్విట్టా బుద్ధిగుండటం ఇంకా సక్కంగ పెద్ద సదూలు సదవాల. గొప్పుజ్జోగం సేయాల..." అని అమ్మ వంద రూపాయల నోటిచ్చి టీచరుకీయమందోసారి. నేనివ్వబోతే "వద్దురా సాయీ మా తమ్ముడు చిన్నా ఎంతో నువ్వూ అంతే నాకు" అనేవారు ప్రతిమా టీచర్. మా మాటంటూంటే నే వింటూంటే నాకెంత సంబరమేసేదో! చిన్నా, రమ, సీత, జయావాళ్లంతా ఎక్కడెక్కడ ఉన్నారో... ఏం చేస్తున్నారో...!?

"తాగుబోతు తండ్రి తాగి తాగి సత్తే తల్లి బాయిలో దూకి పేనం తీసుకుంది. పయివేట్లు సెప్తూ సంసారాన్ని ఒక్క సేత్తో లాక్కొత్తోంది. మీ టీచరమ్మంటే అమ్మోరురా సాయీ... అమ్మోరు...బంగారుతల్లి" ఎనిమిదో తరగతిలో ఉండగా అమ్మ చెప్పే సంగతులు కాస్త కాస్త అర్థం అవుతుండేవి. నేను పదిలోకొచ్చేసరికి మేం అమ్మమ్మగారి ఊరు బళ్ళారి వెళ్లిపోవడం, అక్కడి స్కూల్లో చేరి ఆ వాతావరణానికి అలవాటు పడిపోవడంవల్ల పాత పరిచయాలకు కొంత దూరమయ్యాను. అయితే వచ్చేటప్పుడు ప్రతిమా టీచర్ చెప్పిన "ఎక్కడున్నా మా సాయి బాగా చదువుకుంటాడు. మంచి పొజిషన్‌లోకి వస్తాడు" వంటి మాటలు నాలో దృఢంగా నాటుకున్నాయేమో...ఏకాగ్రతతో చదివి ఎంబిబిఎస్ పూర్తిచేసి బెంగుళూరులో డాక్టర్‌గా సెటిలయ్యాను. దాదాపు పన్నెండేళ్ల తరువాత మళ్లీ చూడబోతున్నాను ప్రతిమా టీచర్‌ని.

"ఇంతోడివయ్యావు. ఓసారి సూసి రారా దండ్రా టీచరమ్మోరిని. దండవెట్టుకునిరా. మనువాడ్డానికో మంచిపిల్ల దొరుకుద్ది నీలా సదూకున్నది" గడ్డీగాదంతోనో, పాడి పశువుల్తోనో నిరంతరం చాకిరీకి అంకితమై పొద్దుపుచ్చే అమ్మ అంతరంగమంతా నేనూ, నా బంగారు భవిష్యత్తే! చదువైనప్పటినుంచీ 'వెళ్లాలి..చూడాలి' అనుకుంటూనే తాత్సారం చేసాను. జాబ్‌లో కూడా సెటిలయ్యాను. ఇప్పుడిక అడ్డేముంది. నాల్రోజులు లీవ్ తీసుకుని ప్లెజెంట్‌గా బయల్దేరాను. తీపి ఊహల ఊయలలూగుతూ ఓ సరికొత్త అనిర్వచనీయమైన ఆనందంతో ఓలలాడుతూ పసిడి బాల్యం తాలూకు మృదుమధుర జ్ఞాపకాలతో పరవశించిపోతూ గాలి అలలపై తేలిపోతున్నట్లుగా రైలు ప్రయాణం, బస్సు ప్రయాణం చేసి మునిమాపు వేళ ఆ ఊరు చేరాను. ఊరు మారింది. కొంత ఆధునికతను సంతరించుకున్నట్లు అనిపిస్తోంది నేను నడిచే దారిలో ప్రక్కప్రక్కగా కనిపిస్తోన్న రెండు లాడ్జిలు, బార్‌షాప్స్, సినిమాహాళ్లను చూస్తుంటే. అమ్మ టీచర్ కోసం ఆప్యాయంగా అత్యంత భక్తితో పంపిన మినపసున్నుండల డబ్బాను నేను అపురూపంగా ఎంపిక చేసి కొన్న మెరూన్ కలర్ చీర ప్యాక్‌ను భద్రంగా బ్యాగ్‌లో ఓసారి తడుముకున్నాను.


ఒక్కొక్క అడుగే ముందుకు పడుతుంటే నాలో చిత్రమైన ఆనందం... అదిగో చెరువుగట్టు...ఆవల కృష్ణుడి గుడి...అరవిరిసిన పున్నాగ చెట్టు...ఇక్కడేం మారలేదు. అంతా అలాగే ఉంది. చిన్నా ఇక్కడే కదూ ఏడుస్తూ కబుర్లు చెప్పేవాడు. అవును...వాళ్లమ్మను జ్ఞాపకం చేసుకుంటూ ఏమిటో ఏమిటో మాట్లాడేవాడు. చిన్నా ఎలా ఉన్నాడో? ఆ పున్నాగ పూల పరిమళాలను ఆస్వాదిస్తూ రమ, సీత, జయ, నేను, చిన్నా ఎన్నాటలు ఆడేవాళ్లం. ఎన్నెన్ని పూలు ఏరుకునేవాళ్లం. సంచినిండా పూలు తీసుకుపోయి టీచర్‌కిస్తే ఆమె ముఖం చెరువులో విప్పారిన తామర పువ్వులే అయ్యేది. ఆ పూలతో పెద్ద మాల కట్టి ఆచారిగారికిచ్చి రమ్మనేవారావిడ. ఆ మాల ఎంత మనోహరంగా ఉండేదో!


ఆచారిగారు కృష్ణుడికి అలంకారం చేస్తూ"సాయీ!ఎంత బావుందిరా పున్నాగ పూల దండ. రోజూ పంపమని చెప్పు మీ టీచరమ్మకి. కన్నయ్య మేలు చేస్తాడు" అనేవారు.

'నిజంగానే టీచర్‌కి చాలా మేలు జరగాలి. అమ్మన్నట్టు మంచి మొగుడు రావాలి. చల్లగా

చూసుకోవాలి. చిన్నా, రమ, సీత, జయ బాగా చదువుకుని గొప్పోళ్లు కావాలి...' ఇలా సాగిపోయేవి నా ఆలోచనలు.

ఆ చెట్టుకల్లంత దూరంలో లైబ్రరీ. ఆ పక్క వీధిలో స్కూలు. నేను ఎనిమిదో తరగతి వరకూ చదువుకున్న ఆ స్కూలు మీదుగా వెడుతుంటే నాలో ఏదో కమనీయ భావన. పసితనపు స్వచ్ఛమైన స్మృతులేవో మనోవీణను మీటాయి. పక్కా





సిమెంట్ రోడ్డు పడడంవల్ల కాబోలు అప్పట్లో బాగా ఎత్తుమీద ఉండే ప్రతిమా టీచర్ ఇల్లు ఇప్పుడు రోడ్డుకు సమాంతరంగా ఉంది. ఆ పెంకుటింటి ముందు పెరడులో ఎర్రటి పూల గుత్తులతో పరచుకున్న గుల్‌మోహర్ చెట్టు... టీచర్‌కి ఎంత ఇష్టమో ఆ చెట్టంటే. ఆ ప్రక్కనున్న వేపచెట్టు నిండా తెల్లని చిన్ని పువ్వులతో కనువిందు చేస్తోంది వసంతఋతువు శోభకు ప్రతీకలా. చిన్నా, నేను ఈ చెట్టెక్కి వేప పూత కోసి తెస్తే టీచర్ పచ్చడి చేసి పెట్టేది.

"చేదు నాకిష్టంలేదు టీచర్" అంటే-

"జీవితంలో సుఖం తీపైతే, కష్టం చేదు. ఇష్టం లేకపోయినా వచ్చిన కష్టాన్ని భరించి, దుఃఖాన్ని దిగమ్రింగక తప్పదుకదా. అందుకే ఈ చేదును కూడా తీపితోపాటు తినడం అలవాటు చేసుకోవాలి" అని ఆప్యాయంగా చెప్పేవారు. మాటలంటే మాటలా అవి... కోకిల కూజితాలే!

చెక్కగేటు శిథిలావస్థలో ఉంది. జాగ్రత్తగా తీసి రెండడుగులు వేసానో లేదో ప్రతిమా టీచర్ కంఠస్వరమే అనుకుంటా వినిపిస్తోంది.

"నీ మూలంగా నా తమ్ముడ్ని పోగొట్టుకున్నాను. చెల్లెళ్లను దూరం చేసుకున్నాను. ఇన్నేళ్లుగా నువ్వు చూపించిన ఈ నరకం చాలు. నానుంచి దూరంగా...మళ్లీ ఎప్పుడూ నీ ముఖం చూపించకుండా వెళ్లిపో. నువ్వు నన్ను విడిచి పెట్టి వెళ్లకపోతే నేనే ఎక్కడికైనా నువ్వు కనిపించనంత దూరంగా వెళ్లిపోతాను" దుఃఖోద్వేగంతో దీనంగా ఇంట్లోంచి వినిపిస్తోన్న ఆ మాటలు విని బల్లమీద కూర్చుండిపోయాను.

"వెళ్లవే వెళ్లు. ఎక్కడికి వెళతావ్? నిన్న చేసుకున్నప్పటినుంచీ నాకు సుఖం లేకుండా పోయింది. ఓ ఐదువందలియ్యి. అలా వెళ్లొస్తా" కరడుగట్టిన నిర్లక్ష్యంతో పొగరుగా అంటున్నాడతను. ఆమె ఏడుస్తోంది. కర్ణకఠోరమైన మాటలతో తిడుతున్నాడు. నా మనసంతా విచారంతో నిండిపోయింది. ప్రతిమా టీచర్ జీవితం ఇంత బాధాకరంగా తయారైందా? ఏమైంది? ఎందుకిలా జరిగింది? మంచి మనసు, మమతగల ఆ తల్లిని ఇంత దారుణంగా దెబ్బతీసిన ఆ క్రూరుడెవరు? ఈ కష్టంలో ఆమెను ఓదార్చడానికి దగ్గర ఎవరూ లేకపోయారా?

ఏమయ్యారు చిన్నా...రమా, సీతా, జయ? ఎక్కడికి వెళ్లారు? ప్రతిమా టీచర్ ఎందుకిలా వంటరిదైపోయింది? ఆ అంతర్యుద్ధం అయిపోయిన కాసేపటికి పంచలోకి వచ్చింది ఆమె. వెనుక నుంచీ అతనేవో మాటలు తూలుతూనే ఉన్నాడు. "ఎవరూ?" అంటూ దగ్గరకు వచ్చింది ప్రతిమా టీచర్. చందమామ మలా కళకళలాడే ఆ ముఖం కన్నీటి కడలిలా ఉంది. అప్పట్లో అందాలు చిందే ఆ కనుదోయిలో అనంతమైన వేదన గూడు కట్టుకుని ఉంది ఇప్పుడు. కృశించిపోయిన ఆ దేహం ఆమె అనుభవిస్తున్న విషాద జీవితాన్ని చెప్పకనే చెబుతోంది. "నేను టీచర్ సాయిని..." కాసింత చిరునవ్వును పులుముకుని చెప్పానేగానీ నా అంతరంగమంతా ఆక్రోశిస్తోంది నేను మనసారా చూడాలని తపించిపోయి వచ్చిన నా టీచర్‌ని ఇలాంటి స్థితిలో చూడవలసి వచ్చినందుకు.

"ఓ నువ్వా సాయీ! మళ్లీ ఎన్నాళ్లికి చూసాను? ఎక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు?"నిలువెల్లా ప్రేమతో పలకరించింది. క్లుప్తంగా చెప్పాను. లోపలికి వెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చింది. అతను బయటకు వచ్చి నన్నోసారి ఎగాదిగా చూసాడు. పక్కా తాగుబోతులా ఉన్నాడు. వంకర నవ్వొకటి విసిరి మత్తుగా తూలుతూ వెళ్లాడు రోడ్డుమీదకు. "నా భర్త" నిర్విణ్ణంగా చూస్తూ అందామె.

"ఈ నీచుడిని ఎలా చేసుకున్నారు టీచర్? చిన్నా వాళ్లంతా మిమ్మల్ని ఇలా వదిలిపెట్టి ఎక్కడికి వెళ్లారు?" బాధగా, ఆరాటంగా అడిగాను.

"చేసుకుంటానంటూ ఇంటి చుట్టూ తిరిగాడు. కాస్త సపోర్ట్‌గా ఉంటాడని అనుకున్నాను. కానీ మళ్లీ మా నాన్ననే అనుక్షణం గుర్తు చేసాడు. తాగొచ్చి నాన్న ఇంట్లో చేసిన అల్లరి తాలూకు దృశ్యాలు మా మనస్సులో ముద్రించుకుపోయాయి. ఆ ప్రభావం నుండి బయటపడకముందే తనకెవ్వరూ లేరనీ, నావాళ్లే తనవాళ్లని కల్లబొల్లి కబుర్లు చెప్పి నమ్మించి ఈ తాగుబోతు నా భర్తగా ఇంట్లోకి ప్రవేశించాడు. పిల్లలమీద కాస్త కనికరం కూడా లేకుండా ప్రవర్తించాడు. సంపాదించినదంతా స్వార్థంకోసం ఖర్చు పెట్టుకుంటూ వాళ్ల నీడే భరించలేకపోయాడు. తాగొచ్చి నన్ను కొడుతుంటే ఎదురు తిరిగిన చిన్నాను విపరీతంగా ద్వేషించి కొట్టేవాడు. లేత మనసులు గాయపడ్డాయి. డిప్రెషన్‌తో నా చిన్నా...నా బంగారు చిన్నా పురుగుల మందు త్రాగి చచ్చిపోయాడు. ఆ షాక్‌తో జయ పిచ్చిదైపోయింది. ఈ దురదృష్టవంతురాలైన అక్కను నమ్ముకుంటే తమకు కడుపునిండా అన్నం కూడా పెట్టలేరనుకున్నారేమో రమ, సీత ఎటో వెళ్లిపోయారు" అంటూ ఒక్కసారిగా బావురుమంటూ ఏడ్చేసిందామె.

కడుపు తరుక్కుపోయింది వింటుంటే. 'నా తమ్ముడంటే నువ్వా అంతే నాకు' అనాడు టీచర్ అన్న మాటలు జ్ఞాపకం చేసుకుంటుంటే చిన్నా రూపం నీళ్లు నిండిన నా కళ్లల్లో అస్పష్టంగా కదిలింది.

"టీచర్...ఇంక మీరిక్కడ ఉండొద్దు. నాతో బయల్దేరండి"

"వద్దులే సాయి. నన్నిలా ఇక్కడే రాలిపోనీ. నా గతం నన్ను పీడిస్తోంది. ఎక్కడున్నా నాకిక అశాంతే. నేనిక ఎంతోకాలం బ్రతకను..." ఆమె మాటలు నా హృదయాన్ని ద్రవింపజేస్తున్నాయి.

"అమ్మా..ఆకలేస్తోంది అన్నం పెట్టవూ" అంటూ వచ్చాడు ఆరేళ్ల పిల్లాడు. సంభ్రమంగా చూసాను. చిన్నా ప్రతిరూపంలా ఉన్నాడు. గుడిలోని నల్లని కన్నయ్యలా ముద్దులు మూటగడుతూ కన్పిస్తున్నాడు.

"అమ్మా... పిచ్చి పిన్ని ఇందాకే తిను...తిను అంటూ మట్టి పెట్టింది. నేను తిన్లేదని ఇక్కడ గిచ్చింది" అంటూ చేయి చూపిస్తున్నాడు.

ప్రతిమా టీచర్ "నేను కొడతాలే దాన్ని. నువ్వెళ్లి కాళ్లు చేతులు, ముఖం కడుక్కుని రా. అన్నం పెడతాను ఈ మామయ్యకీ, నీకూ..."

ఎప్పుడొచ్చిందో ఏమో... "చిన్నా...నా కన్నా ఆడుకుందాంరా. ఆ తాగుబోతోడు కొడతాడు" అంటూ పిలుస్తోంది అదేపనిగా పిచ్చి జయ.

"సాయీ! వీలైతే నాకొక్క సాయం చేయి. వీడిని ఈ పరిసరాలకు దూరంగా ఈముద్రలేవీ పడనంత దూరం తీసుకువెళ్లి ఏదైనా అనాథాశ్రమంలో చేర్చు. వాడు ఆనందంగా, ఆరోగ్యంగా పెరగాలి" ముఖం చేతుల్లో కప్పుకుంటూ అందామె. ఆ రోజుల్లో ఆమె చెప్పిన మంచి మాటలతో విద్య, వివేకం పెంచుకుని నేడు నేనీ స్థితికి వచ్చాను. ఆమెకోసం నేనేమైనా చేయకపోతే నా బ్రతుకెందుకు?

"టీచర్...బాబుని నా దగ్గరే ఉంచుకుని నా కంటే గొప్పగా తయారు చేస్తాను. మీరు ధైర్యంగా ఉండండి" అన్నాను శోకతప్త హృదయంతో.

నాలుగురోజులు లాడ్జిలో రూమ్ తీసుకుని ఉన్నాను. బాబు బాగా మాలిమి అయ్యాడు. అలవాటుపడ్డాడు ఫర్వాలేదు ఇక అనుకుని ట్రైన్‌లో తీసుకువస్తుంటే నిద్రపోయేవేళ అమ్మ కావాలన్నాడు. నాకేడుపొచ్చింది. నా కన్నీళ్లు తుడిచాడు. వాళ్లమ్మ కన్నీళ్లు కూడా అలాగే తుడుస్తాడుట. పాట పాడమన్నాడు. 'మల్లెలకన్నా...జాబిలికన్నా..చల్లని పాపాయి లాలిజో' అని గుర్తు ఉన్నంతవరకూ పాడాను. "భలే...భలే...అమ్మలాగే పాడావు" అంటూ చప్పట్లు కొట్టాడు. అలాగే లాలిస్తూ బుజ్జగిస్తూ నిద్రపుచ్చి వాడి భవిష్యత్తు గురించి బంగారు కలలోకి జారుకున్నాను.

★

## జీవితాన్ని మార్చిన టెస్టు

కేవలం పుట్టినతేదీని బట్టి అసలైన వయస్సు ఉండదని ప్రతి మహిళ శరీరంలోని ఒక బయోలాజికల్ క్లాక్ టక్‌టక్‌మని ముందుకి పోతుందని ఇటీవల వైద్యపరిశోధనలో తేలింది. రక్తపరీక్షల్లో 31ఏళ్ళ మోర్గాన్ అనే మహిళకి బయోలాజికల్‌గా 37ఏళ్లని తేలిందిట. అంచేత తొందరపి తన 32వ యేట ఫెలిక్స్ అనే ఆడపిల్లని కనడానికి సిద్ధపడింది. ఇలాంటి టెస్టు తను చేయించుకోకపోయి ఉంటే మరికొన్నాళ్ళు వాయిదా వేసి ఇబ్బందుల్లో పడి ఉండేదాన్నని మోర్గాన్ నమ్ముతోంది. కెరీర్‌లో పైకి వద్దామని పిల్లల్ని కనడాన్ని వాయిదావేసే మహిళలకి ఇది హెచ్చరిక అంటున్నారు డాక్టర్లు.

## సేవానిరతి

ప్రపంచంలో వేలాదిమంది సాహసికులు యేటా ఎవరెస్ట్ నెక్కుతున్నారు. అయితే వాళ్ళు హిమాలయాల్లో వదిలిపెట్టే చెత్తతో ఆ వాతావరణం పాడైపోతోంది. కొంత చెత్తని వెనక్కి తీసుకురావడానికి ఇటీవల కొందరు ఒక పనిగా పెట్టుకుని శ్రమపడుతున్నా అక్కడ చెత్త పేరుకుపోతూనే ఉంది. పర్వతారోహకుల్లో చైతన్యం తీసుకురావాలని జెఫ్‌క్లేఫ్ అనే ఆర్టిస్టు అక్కడనించి వచ్చిన అల్యూమినియం పాత్రల్ని, ఆక్సిజన్ బాటిల్స్‌ని మార్చి గంటలు, గిన్నెలు, నగలుగా రూపొందించి వాటిని సావనీర్లుగా పర్వతారోహకులకి అమ్ముతున్నాడట. ఇప్పటికలాంటివి 35గంటలు, గిన్నెలు అమ్మాడట.

## జపాన్‌లో బిల్క్ విప్లవం

గతంలో జపాన్‌లో పాలు విరిగిపోతే డెయిరీవాళ్ళు తెగ ఇదైపోయేవారు. ఇటీవల విరిగిన పాలతో బీరు తయారుచేయవచ్చని తెలిశాక వాళ్లు సంబరపడుతున్నారు. దానికితోడు దేశంలో పాల ఉత్పత్తి కూడా బాగా పెరిగింది. కొందరు చురుకైన షాపులవాళ్లు బిల్క్ అనే పేరుతో బీరులో 30శాతం మిల్కుని కలిపి అమ్మసాగారు. మీడియా పబ్లిసిటీతో జనం ఎగబడితే షాపుల్లోని స్టాకులు క్షణాల మీద ఖాళీ అయ్యాయి.

-తటవర్తి